క్లుప్తంగా

పరామర్శ..



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పెదపతివాడ గ్రామానికి చెందిన వాళ్లె రామునాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి జనార్దనరావు, ఎస్. సత్యనారాయణరాజు, పిన్నింటి నారాయణరావు, తదితరులు ఉన్నారు.

క్షణికావేశం తగదు

• మానసిక వైద్యురాలు మౌనిక తేజశ్విని



కార్యక్రమంలో మాట్లాడుతున్న మౌనిక తేజశ్విని

విజయనగరం ఫోర్ట్: చాలామంది క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. ఇది తగదని మానసిక వైద్యురాలు మౌనిక తేజశ్విని అన్నారు. అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా శనివారం స్థానిక ఎస్‌కే డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, పరీక్షల్లో ఒత్తిడికి గురైన విద్యార్థులు, మనసుకు దగ్గరైన వారు దూరమైనప్పుడు ఆత్మహత్యలకు పాల్పడుతుంటారన్నారు. ఏమైనా సమస్యలున్నప్పుడు మనసుకు దగ్గరైన వారితో చర్చించాలని సూచించారు. మానసిక సమస్యలుంటే 14416 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, రాజు, సంతోషి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణతో ఓజోన్ పొర పరిరక్షణ

• కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సరిత

విజయనగరం రూరల్: కాలుష్య నియంత్రణతోనే ఓజోన్ పొర పరిరక్షణ సాధ్యమని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ (ఈఈ) బి.బి.సరిత అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని కస్పా ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ సరిత మాట్లాడుతూ, ఆధునిక ప్రపంచంలో కాలుష్యం కోరలు చాస్తోందన్నారు. ప్లాస్టిక్ వినియోగం నియంత్రించడంతో పాటు జల, వాయు కాలుష్యం నియంత్రణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఓజోన్ దినోత్సవ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో చిత్తు కావొద్దు..

• వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: విద్యార్థులు మత్తు పదార్థాలతో చిత్తు కావద్దని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం స్థానిక బీపీఎం పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తుపదార్థాలకు అలవాటు పడితే విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. గంజాయి, హెరాయిన్, నల్లమందు, మద్యం వ్యసనాల జోలికి పోవద్దన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు, బీపీఎం పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

నెల్లిమర్ల రూరల్: ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు శనివారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర వల్ల కలిగే లాభాలను వివరిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

తక్కువ వడ్డీకి రుణాలు

విజయనగరం అర్బన్: మహిళా పొదుపు సంఘాలకు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తున్నామని పంజాబ్ నేషనల్ బ్యాంక్ జోనల్ మేనేజర్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ అన్నారు. పీఎన్‌బీ విజయనగరం బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీజీఎం నీలిమ, మెప్మా పీడీ సుధాకరరావు పాల్గొన్నారు.

పక్కాగా చెత్త సంపద కేంద్రాల నిర్వహణ

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. మండలంలోని బూరాడపేటలో నిర్మాణంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

ఆర్‌బీకేలతో రైతు సంక్షేమం..



కొప్పెర్ల రైతు భరోసా కేంద్రం

• అందుబాటులో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు
• అవసరమైన సమయాల్లో సలహాలు అందిస్తున్న సిబ్బంది

మండలంలో ఆర్‌బీకే కేంద్రాలు:	19
లబ్ధి పొందుతున్న రైతులు:	10,800
వ్యవసాయ పరికరాలు తీసుకున్న రైతులు:	101
క్రాప్ ఇన్సూరెన్సు తీసుకున్న రైతులు:	0
రైతుభరోసా పథకం మంజూరైన రైతులు:	10,800

పూసపాటిరేగ: గత పాలకులు అన్నదాతను నిర్లక్ష్యం చేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుకు అన్నివిధాలుగా అండగా నిలుస్తోంది. రైతులకు గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు) ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారు. ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు అవసరమైన సమయంలో వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు అందిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో సేవలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అనేక సేవలు అందుతున్నాయి. గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ కార్యాలయానికి వెళ్లాల్సిన దుస్థితి. ప్రస్తుతం ప్రతి గ్రామంలో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు అన్ని సేవలు అందుతున్నాయి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంట అమ్మకం , భూసార పరిక్ష కోసం మట్టి నమూనాలు సేకరణ, సీఆర్‌సీ కార్డు ఉన్న కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు, రైతుభరోసా పెట్టుబడి సాయం, పొలంబడి కార్యక్రమాల ద్వారా సాగుపై అవగాహన, తదితర సేవలు అందిస్తున్నారు. అలాగే వ్యవసాయ పనిముట్లుతో పాటు ట్రాక్టర్లను సైతం సబ్సిడీపై అందజేస్తున్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలలో ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో దొరుకుతున్నాయి. సీజనుతో సంబంధం లేకుండా రైతు అవసరాలకు కావాల్సిన అన్నీ కేంద్రాలలో లభిస్తున్నాయి. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు దొరుతున్నాయి.

కె.నీలిమ , వ్యవసాయ అధికారి పూసపాటిరేగ

ఈక్రాప్‌తో రైతులకు మేలు

రైతుభరోసా కేంద్రం సిబ్బంది ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజనులో చేపట్టే ఈక్రాప్ బుకింగ్‌తో ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ప్రకృతి వైపరిత్యాలతో పంట నష్టపోతే బీమా మంజూరు చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.

కె. వెంకటరావు , రైతు పూసపాటిరేగ.

ఆరోగ్యమే మహాభాగ్యం



వ్యాయామశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
• 35వ డివిజన్‌లో రూ.23 లక్షలతో నిర్మించిన వ్యాయామశాల ప్రారంభం

విజయనగరం: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 35వ డివిజన్ వీటీ అగ్రహారం ప్రాంతంలో రూ.23 లక్షల కార్పొరేషన్ నిధులతో ఏర్పాటు చేసిన వ్యాయామశాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక యువత కోరిక మేరకు వ్యాయామశాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, స్థానిక కార్పొరేటర్ చందక శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్ పరిధిలో ఇప్పటికే రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికే దక్కుతుందన్నారు. ఇటీవల కాలంలో రూ.1.60 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రహదారులు, కాలువల నిర్మాణాలు చేపట్టి ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించారని గుర్తు చేశారు. కోలగట్ల ఆరోగ్యాలయం పేరుతో వ్యాయామశాలను ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపిస్తే నగరం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, జోనల్ ఇన్‌చార్జ్‌లు కుమ్మరిగంటి శ్రీనివాసరావు, మారం బాలబ్రహ్మారెడ్డి, మాజీ కౌన్సిలర్ తాత్రాజు కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు అశోక్, కార్పొరేషన్ ఈఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసిన ఘనత జగనన్నదే..



లబ్ధిదారుతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

• విజయనగరం కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్
• 50వ డివిజన్ వైఎస్సార్‌నగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

విజయనగరం: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు నవరత్నాల పేరిట అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తోన్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని విజయనగరం కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ అన్నారు. అటువంటి గొప్ప పాలనను ప్రజలంతా ఆశీర్వదించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలో గల వైఎస్సార్‌నగర్‌లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మితో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో ఇంటికి కలిగిన లబ్ధిని వివరించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఆ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు లేవని స్థానికులు తెలియజేయడంతో.. సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో నగరం అన్నివిధాలు ముందుకెళ్తోందన్నారు. వైఎస్సార్‌నగర్ ప్రాంతంలో గతంలో 3500 మంది లబ్దిదారులకు గృహ సౌకర్య కల్పించారని తెలిపారు. అలాగే ప్రస్తుతం గుంకలాం, సారిక వంటి ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోనంగి జగన్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం..



విజయనగరం: మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



విజయనగరం అర్బన్: విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీఆర్‌ఓ అనిత, పీసీబీ ఈఈ సరిత



విజయనగరం టౌన్: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ అల్లు సూరిబాబు, తదితరులు

విజయనగరం: విఘ్నాలు తొలగించే వినాయక చవితి పండగలో మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మదర్ థెరీసా సేవా సంఘ అధ్యక్షుడు త్యాడ ప్రసాద్ పట్నాయక్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అయ్యన్నపేట జంక్షన్‌లో 300 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణం పాడవుతుందని, అందుకే మట్టి విగ్రహాలనే పూజించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు త్యాడ వేణుగోపాలం, శ్రీనివాస్, శ్రావణి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం..

నెల్లిమర్ల రూరల్: పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని హెచ్‌ఎం వేణుగోపాల్ పిలుపునిచ్చారు. మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాలలో మట్టి వినాయకుల తయారీపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి ఆధ్వర్యంలో ...

విజయనగరం టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ అల్లు సూరిబాబు అన్నారు. సాక్షి మీడియా, స్పార్క్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సాక్షి కార్యాలయం వద్ద వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పార్క్ సొసైటీ పద్మనాభం, సాక్షి సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం..

విజయనగరం అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యావరణానికి హాని కలుగని రీతిలో వినాయక చవితి పర్వదినాన్ని ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత మాట్లాడుతూ, ఐదుచోట్ల ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

టీటీడీ ఆవరణలో ..

విజయనగరం టౌన్: అమ్మానాన్న స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు పీవీ నరసింహాచార్యులు, కార్యదర్శి జి.తిరుపతిరావు, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అధికారి జె.శ్యామ్‌సుందరం, ఎస్.రంగారావు, షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల: ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాలను పూజించవద్దని ఎస్సై పి. నారాయణరావు అన్నారు. జైత్ర కన్‌స్ట్రక్షన్స్ సహకారంతో నెల్లిమర్లలో సుమారు రెండువేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ అధినేత ఆల్తి శ్రీనివాసరావు, రేగాన గోవిందరావు, సుదర్శనం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లిలో అరబిందో పరిశ్రమ సహకారంతో రూ. 80 లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరబిందో పరిశ్రమ డైరెక్టర్ నిత్యానందరెడ్డి తీరప్రాంత అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్య, ఆరోగ్యం, తాగునీరు కోసం పరిశ్రమ యాజమాన్యం లక్షలాది రుపాయలు ఖర్చు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి జనార్దనరావు, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బర్రి చినఅప్పన్న, అరబిందో పరిశ్రమ ప్రతినిధులు కమలాకర్‌రెడ్డి, గోపాల్‌కృష్ణ, సర్పంచ్ బర్రి మొసలి, ఎంపీటీసీ సభ్యుడు మైలపల్లి తాత, మొంగం నాగబాబు, కొయ్య ఎల్లన్నరెడ్డి, డి. ఈశ్వరరావు, జనపాల అప్పారావు, మైలపల్లి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నమోదుకు గడువు పెంపు

విజయనగరం అర్బన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష కోసం నమోదు చేసుకోవడానికి గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ స్కూల్లో, వసతి సౌకర్యం లేని ఏపీ మోడల్ స్కూల్స్‌లో 8వ తరగతి చదువుతూ రూ.3.5 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ నెల 28వ తేదీలోగా నామినల్ రోల్స్‌కు సంబంధించిన పత్రాలతో జతపరచి స్ట్రాంగ్ రూమ్, ఎంఆర్ మోడల్ స్కూల్‌లోని స్ట్రాంగ్ రూంనకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 'బీఎస్‌ఈ.ఏపీ.జీఓవి.ఐఎన్' వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు.

ప్రజారోగ్యమే సీఎం లక్ష్యం

• వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: ప్రజారోగ్య రక్షణే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గుడివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ పెద్దలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీలం అప్పలనాయుడు, ఏపీఓ ఆదిబాబు, మాజీ సర్పంచ్ దాసరి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జరజాపుపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి జి. సమీర, యూపీహెచ్‌సీ డీఈఓ ఎం. శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

21న వేలంపాట

విజయనగరం: నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్మించిన 22 దుకాణాలను లీజు పద్ధతిలో కేటాయించేందుకు ఈనెల 21న వేలంపాట నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మూడు పర్యాయాలు వేలంపాట నిర్వహించినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో వేలంపాట వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 21న ఉదయం 11.30 గంటలకు కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో నిర్వహించే వేలంపాటలో ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని కోరారు.

ముగిసిన శిక్షణ

విజయనగరం ఫూల్‌బాగ్: ఫూల్‌బాగ్‌లోని ఆదర్శ పాఠశాలలో లీడ్ ఇండియా ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో లీడ్ ఇండియా – నీ అభివృద్ధే, దేశాభివృద్ధి అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రుక్సానా ఫర్వీన్, టి. శ్రీనివాసరావు, కె. మహేశ్వరరావు, లీడ్ ఇండియా శిక్షకులు శ్రీనివాస్, జగదీష్, చంద్రశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల విద్యార్థులు అండర్ - 17 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలలో ఈనెల 15న నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన పి. ప్రసాద్, కె. వినోద్, ఎం. చరణ్, పి. శ్రీరామ్, ఎస్. వీరయ్య ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం కె. సూర్యనారాయణ తెలిపారు. ఈమేరకు విద్యార్థులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వి. రామచంద్రుడు, బి. జయకర్‌జాన్సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీరప్రాంత పరిరక్షణ అందరి బాధ్యత

పూసపాటిరేగ: తీరప్రాంత పరిరక్షణ అందరి బాధ్యతని చింతపల్లి మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ కె.వైకుంఠరావు అన్నారు. మండలంలోని తిప్పలవలస తీరంలో సముద్ర పరిశుభ్రత దినోత్సవంలో భాగంగా శనివారం బీచ్ క్లీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సముద్రంలో వ్యర్థాలు కలవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయన్నారు. తీరంలో చెత్తాచెదారాలు వేయకుండా తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ కామయ్య, మెరైన్ ఎస్సై శ్రీనివాసరావు, మత్స్యశాఖ సిబ్బంది హేమంత్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కోకోనట్ రైతుల సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

పూసపాటిరేగ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొబ్బరి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోకోనట్ రైతుల సంఘ జిల్లా అధ్యక్షుడు మొంగం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ కంపెనీలో బోర్డు డైరెక్టర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొబ్బరి రైతుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొబ్బరితో వివిధ రకాల ఉత్పత్తులను తయారుచేసి విక్రయిస్తామని తెలిపారు. అలాగే రైతులకు రాయితీపై ఎరువులు రాయితీపై అందిస్తామన్నారు. కంపెనీ చైర్మెన్ ఎరకయ్యదొర, డైరెక్టర్లు మొంగం నాగబాబు, రౌతు సాయికుమార్, పబ్బిరెడ్డి అప్పడుదొర, తదితరులు పాల్గొన్నారు.

జక్కు రామకృష్ణకు సత్కారం



డాక్టర్ జక్కు రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న వాగ్దేవి సమారాధనం సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: వాగ్దేవి సమారాధనం, జై పైడిమాంబ వేద సంస్కృతాంధ్ర సంప్రదాయ పరిరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ దంపతులను సత్కరించారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎమ్.శశిభూషణరావు ముఖ్య అతిథిగా హాజరై రామకృష్ణ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కె.ప్రకాష్, ఎలిశెట్టి సురేష్, గురజాడ ఇందిర, సాహితీ, బురిడి అనురాధ పరశురామ్, బాషా పాల్గొన్నారు.